సాక్షి కామారెడ్డి

గురువారం । 12 । జూన్ । 2025



భూభారతి నిరంతర ప్రక్రియ

భూభారతి నిరంతరం కొనసాగుతుందని, రైతుల భూసమస్యలను పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ విక్టర్ పేర్కొన్నారు.

- 9లో ▸



పేదలకు అండగా కస్తూర్బాలు

పేద విద్యార్థులకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు అండగా నిలుస్తున్నాయి. వీటిలో చేరేందుకు పోటీ నెలకొంది.

- 9లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.3 /21.8

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో అడపాదడపా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

గంపను పరామర్శించిన మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: అస్వస్థతకు గురై హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌ను బుధవారం మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఈ–పాస్ ద్వారానే ఎరువులను విక్రయించాలి



ఎల్లారెడ్డిరూరల్: ఈ–పాస్ యంత్రాల ద్వారానే రైతులకు ఎరువులను విక్రయించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్ సూచించారు. బుధవారం ఎల్లారెడ్డి, మత్తమాల సొసైటీలతో పాటు, వెల్లుట్లలోని ఫర్టిలైజర్ దుకాణాలలో ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. దుకాణాదారులు రైతులకు ఈ–పాస్ యంత్రాల ద్వారానే ఎరువులు అందించాలని, స్టాక్ రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి



కామారెడ్డి క్రైం: పాఠశాల బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. స్కూల్ బస్సుల డ్రైవర్లు, యజమానులకు బుధవారం పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీటీవో మాట్లాడుతూ స్కూల్ బస్సులు ప్రమాదాలకు గురికాకుండా డ్రైవర్లు, యాజమాన్యాలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాలల వద్ద పిల్లలు రోడ్డు దాటే క్రమంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఫిట్‌నెస్ లేని బస్సులు నడపరాదన్నారు. నిబంధనల ప్రకారం బస్సులు నడపకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంవీఐలు శ్రీనివాస్, నాగలక్ష్మి, ఏఎంవీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

42 మంది కానిస్టేబుళ్ల బదిలీ



కామారెడ్డి క్రైం: జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న 42 మంది కానిస్టేబుళ్లు బదిలీ అయ్యారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఎస్పీ రాజేశ్ చంద్ర ఆధ్వర్యంలో కానిస్టేబుళ్ల బదిలీల ప్రక్రియ నిర్వహించారు. ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న 35 మంది సివిల్, ఏడుగురు ఏఆర్ కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితులు, సర్వీస్ రికార్డులను పరిశీలించి పారదర్శకంగా బదిలీల ప్రక్రియ చేపట్టామన్నారు. ఒక్కరు తప్పు చేసినా ఆ ప్రభావం మొత్తం శాఖపై పడుతుందన్నారు. ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో పాటు నిబద్ధత, నిజాయితీతో విధులు నిర్వహించాలని కానిస్టేబుళ్లకు సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, ఏఆర్ డీఎస్పీ యాకూబ్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ తిరుపయ్య, ఆర్ఐలు నవీన్‌కుమార్, కృష్ణ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం కింద ఈ విద్యాసంవత్సరంలో ఇంగ్లిష్ మీడియం రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఎస్సీ విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమాధికారి వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఒకటో తరగతిలో ప్రవేశాలకు డే స్కాలర్లకు 70, రెసిడెన్షియల్ స్కూళ్లలో ఐదో తరగతి ప్రవేశాలకు 72 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 16 వరకు దరఖాస్తులను కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈనెల 20న లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

- విద్యార్థుల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాం
- పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో డీఈవో రాజు



సాక్షి ఇంటర్వ్యూ

కామారెడ్డి టౌన్: ''జిల్లాలో ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య అందుతోంది. ఈ అంశాన్ని వివరిస్తూ అడ్మిషన్లను పెంచడానికి విస్తృతంగా బడి బాట నిర్వహిస్తున్నాం. పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికీ చర్యలు తీసుకుంటున్నాం'' అని డీఈవో రాజు పేర్కొన్నారు. వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు..

సాక్షి : ఏటా ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ప్రవేశాల పెంపునకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఈవో: జిల్లాలో బడిబాట నిర్వహిస్తున్నాం. ముందస్తు బడిబాటలో నాలుగువేల మంది బడీడు పిల్లలను గుర్తించాం. గతేడాది జిల్లాలో 2,500 న్యూ అడ్మిషన్లు జరిగాయి. ఈసారి 5 వేల అడ్మిషన్లు లక్ష్యంగా పనిచేస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న 4,700 చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విషయమై ప్రత్యేక దృష్టి పెట్టాం.

ప్రశ్న: పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు ఎప్పటివరకు పంపిణీ చేస్తారు?

డీఈవో: జిల్లాలో 5,00,129 పాఠ్యపుస్తకాలు, 82,295 ఏకరూప దుస్తులు అవసరం. ఇప్పటికే అన్ని మండలాలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు చేరాయి. నేటి నుంచి పంపిణీ చేస్తాం.

ప్రశ్న: జిల్లాలోని బడుల్లో చాలా సమస్యలున్నాయి. వాటిని ఎలా అధిగమిస్తారు?

డీఈవో: 114 పాఠశాలల్లో బాలికల బాత్రూంలు, మరుగుదొడ్ల మరమ్మతుల కోసం ఈజీఎస్ కింద రూ. 2.28 కోట్లు మంజూరయ్యాయి. 19 కేజీబీవీలలో మరమ్మతుల కోసం రూ. 3.41 కోట్లు మంజూరు అయ్యాయి. అత్యవసరంగా 50 శాతం నిధులు విడుదల చేశారు. వీటితో పనులు చేపట్టి సమస్యలు పరిష్కరిస్తాం. అలాగా జిల్లాలో 22 భవిత కేంద్రాలలో మరమ్మతుల కోసం రూ. 1.26 కోట్లు మంజూరు కాగా రూ. 51 లక్షల నిధులు విడుదల చేశారు. మన ఊరు– మనబడి పనులు నిలిచిపోవడంతో వంటగదుల నిర్మాణాలు నిలిపోయాయి. వాటి గురించి ఉన్నతాధికారులకు నివేదించాం.

ప్రశ్న: మూతపడిన బడులను తిరిగి తెరిచే అవకాశాలుఉన్నాయా?

డీఈవో: జిల్లాలో గతేడాది 46 స్కూళ్లు మూతబడ్డాయి. శివాయిపల్లితో పాటు మరో రెండు తండాలలో స్కూళ్లను తెరిపించాం. గ్రామాల్లో స్థానిక అంగన్‌వాడీల నుంచి చిన్నారులను చేర్పించి మిగిలిన వాటిని తెరిపించేందుకు కృషి చేస్తాం.

ప్రశ్న: జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ఎలా కొనసాగుతుంది?

డీఈవో: జిల్లాలో గతేడాది ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడంతో ఈసారి అంతగా సమస్య లేదు. 100 మంది ఉపాధ్యాయులను సర్దుబాటుకు సిద్ధం చేశాం. ఇంకా అడ్మిషన్లను బట్టి ఈనెల చివరి వారంలో సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేస్తాం.

ప్రశ్న: ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల నియంత్రణకు ఏ చర్యలు తీసుకుంటున్నారు?

డీఈవో: విద్యాశాఖ అనుమతి మేరకు, నిబంధనల ప్రకారమే ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు తీసుకోవాలి. అధిక ఫీజులు వసూలు చేసినా, పుస్తకాలు, ఇతర సామగ్రి విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతోంది. మధ్యాహ్న భోజనం, ఉచితంగా యూనిఫాం, పుస్తకాలు అందిస్తున్నాం. తల్లిదండ్రులు కూడా ఆలోచించి తమ పిల్లలను సర్కారు పాఠశాలల్లోనే చేర్పించాలి.

ప్రశ్న: పదో తరగతి ఫలితాల్లో జిల్లా వెనుకంజలో ఉంటుంది. ఉత్తీర్ణత పెంపునకు ఎలాంటి ప్రణాళిక అమలు చేయనున్నారు?

డీఈవో: ఈసారి పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. ఫలితాలను మెరుగుపరిచేందుకు హెచ్ఎంలకు ఇప్పటికే ఐదు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. కాంప్లెక్స్ హెచ్ఎంలు తమ పరిధిలోని ప్రతి పాఠశాలను సందర్శించి, బోధన తీరును పర్యవేక్షించాలని ఆదేశించాం.

నేడు బడులు పున:ప్రారంభం

కామారెడ్డి టౌన్: జిల్లాలో గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. జిల్లాలో 698 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 124 ప్రాథమికోన్నత, 191 ఉన్నత పాఠశాలలు, 19 కేజీబీవీ, ఆరు మోడల్ స్కూల్స్, రెండు రెసిడెన్షియల్స్ ఉన్నాయి. వీటిలో 80 వేలకుపైగా విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. 196 ప్రైవేట్ పాఠశాలలున్నాయి. మొదటి రోజు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేయాల్సి ఉంటుంది.

చదువుల చెట్టు



ఎల్లారెడ్డిలో 1952లో ఏర్పాటైన ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1952వ సంవత్సరంలో ప్రారంభమైంది. నాటి నుంచి నేటి వరకు ఎన్నో వేల మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదివారు. ఎంతోమంది ఉన్నతికి ఈ బడి కారణమైంది. ప్రస్తుతం ఇంటిలిజెన్స్ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న రంజన్ రత్నకుమార్ ఈ బడి విద్యార్థే. ఇక్కడ చదివినవారిలో చాలామంది డాక్టర్లుగా, లాయర్లుగా, ఉపాధ్యాయులుగా, ఇతర రంగాలలో సేవలందిస్తున్నారు.

మా నాయిన ఈడ్చుకెళ్లిండు



ఎడ్ల రాజిరెడ్డి

భిక్కనూరు: ''దేశానికి స్వాతంత్య్రం వచ్చిన ఏడాది తర్వాత నేను బడిలో చేరిన. రేపటినుంచి బడికి పోవాలె అని మా నాయిన దుర్గారెడ్డి ముందుగనే చెప్పిండు. దీంతో నేను పొద్దున్నే లేచి మా చుట్టాలింటికి వెళ్లి దాక్కున్న. ఎట్ల తెలుసుకున్నడో ఏమో నన్ను పట్టుకుని బడికి తీసుకువెళ్లిండు. నేను రానని మారాం చేస్తే రోడ్డుమీద ఈడ్చుకెళ్లిండు'' అని డీసీసీబీ మాజీ చైర్మన్, రామేశ్వర్‌పల్లికి చెందిన ఎడ్ల రాజిరెడ్డి తాను తొలిరోజు స్కూల్‌కు వెళ్లిన అనుభవాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు. ''అప్పట్లో సర్కారు బడులే ఉండేటివి. మంచి చదువు చెప్పెటోళ్లు. మా ఊరు రామేశ్వర్‌పల్లిలోని సర్కారు బడిలో మూడో తరగతి దాకా చదివిన. భిక్కనూరులో ఏడో తరగతి వరకు, కామారెడ్డిలో పదో తరగతి వరకు చదువుకున్న. నా ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లను కూడా సర్కారు బడికే పంపించిన'' అని పేర్కొన్నారు.

కొంచెం హుషారు.. కొంచెం భయం..



శివకుమార్ గౌడ్

కామారెడ్డి టౌన్: ''మా అమ్మానాన్నలు అనసూయ, రామాగౌడ్ చదువుకోలేదు. మేనమామ లక్ష్మాగౌడ్ అప్పట్లోనే పదో తరగతి చదివారు. ఆయనే నన్ను 1977 సంవత్సరంలో పిట్లంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు తీసుకువెళ్లారు. ఆయన కట్టె పలక, బలపం పట్టుకుని స్కూల్‌కు తీసుకెళ్తుంటే హుషారుగా అనిపించింది. అయితే తొలిరోజు కాబట్టి కొంచెం భయపడ్డాను. తోటి పిల్లలు ఇంటికి వెళ్తామని ఏడ్చేవారు. నేను మాత్రం బయటపడలేదు. మరుసటి రోజునుంచి బడి అలవాటైంది. అనంతరం కొంచెం లేటైనా ఇంట్లో వాళ్లపై అరిచేవాడినట'' అని చంచల్‌గూడ్ జైల్ సూపరింటెండెంట్, పిట్లంకు చెందిన నవాబ్ శివకుమార్ గౌడ్ స్కూళ్లో చేరిన మొదటి రోజు అనుభవాలను వివరించారు. అయితే ప్రభుత్వ బడికి వెళ్లకముందే అయ్యవారి వద్దకు వెళ్లి ఓనమాలు దిద్దానని పేర్కొన్నారు. చదువు రాకుంటే అయ్యవారు దెబ్బలు కొట్టి మరీ చదువు చెప్పేవారని గుర్తు చేసుకున్నారు. క్రమశిక్షణలో నడిపించేందుకోసం టీచర్లు బెత్తంతో కొట్టేవారని, ఆ క్షణాలు, ఆ రోజులే వేరంటూ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

ఆదర్శం.. బాలికల పాఠశాల

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతతో ఆదర్శంగా నిలిచింది. ఈ బడిలో గత విద్యాసంవత్సరంలో 70 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా అందరూ పాసయ్యారు. సంసిత అనే విద్యార్థిని 560 మార్కులు సాధించింది. 63 మంది 500 లపైచిలుకు మార్కులు సాధించారు. ఈ పాఠశాల విద్యార్థులు గతేడాది సైతం వంద శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.

ఏడుస్తూ బడికెళ్లిన



ధన్నారపు శ్రీనివాస్

భిక్కనూరు: ''మా నాన్న నన్ను భిక్కనూరు సీయూపీఎస్‌లో చేర్పించారు. తొలిరోజు బడికి వెళ్లడానికి భయమేసింది. నాన్నే బలవంతంగా తీసుకువెళ్లారు. ఏడ్చుకుంటూ బడికి వెళ్లిన'' అని సైబరాబాద్‌లో డీసీపీగా పనిచేస్తున్న భిక్కనూరుకు చెందిన ధన్నారపు శ్రీనివాస్ తాను బడికివెళ్లిన తొలి రోజు అనుభవాన్ని వివరించారు. గురువులు విద్యాబుద్ధులు నేర్పి, క్రమశిక్షణతో నడిచేలా తీర్చిదిద్దారన్నారు. భిక్కనూరు ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీలో చేరానని, 1981–82 లో సార్జంట్ ర్యాంకర్‌గా పనిచేశానని పేర్కొన్నారు. పోలీస్ ఆఫీసర్ కావాలన్న కలను క్రమశిక్షణతో సాకారం చేసుకున్నానన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదవడం వల్ల ఊరంతా స్నేహితులు ఉన్నారన్నారు. క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్య అందడం వల్లే ఈ స్థాయికి చేరగలిగానని పేర్కొన్నారు.

ఆనందంగా వెళ్లా..



రత్నకుమార్

ఎల్లారెడ్డి: ''నాకు ముగ్గురు అన్నయ్యలు.. వారితో కలిసి తొలిరోజు పాఠశాలకు ఆనందంగా వెళ్లా. ఆ తర్వాత కూడా ఏ రోజూ డుమ్మా కొట్టినట్లు గుర్తులేదు. ముగ్గురు అన్నయ్యలతో కలిసి వెళ్లి చదువుకోవడం మంచి అనుభూతిని ఇచ్చింది. ఆ రోజులలో ఉపాధ్యాయులు నేర్పిన విద్యతో నేను ఈ స్థాయికి ఎదిగాను. చిన్ననాటి జ్ఞాపకాలు మర్చిపోలేనివి. గురువులు నేర్పిన వినయం, విధేయత మంచి జీవితాన్ని అందించాయి'' అని తన జ్ఞాపకాలను వివరించారు ఇంటిలిజెన్స్ ఎస్పీ రంజన్ రత్నకుమార్. ఆయన స్వగ్రామం ఎల్లారెడ్డి. ఇక్కడి ప్రభుత్వ పాఠశాలలోనే పదో తరగతి వరకు చదివారు.

గురుకులంలో 'ఫోన్ మిత్ర'

- విద్యార్థులకు స్మార్ట్‌కార్డ్ ఫోన్ సౌకర్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ఎల్లారెడ్డి: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు హోమ్ సిక్‌కు గురవుతుంటారు. తల్లిదండ్రులతో మాట్లాడాలని ఉన్నా.. వారు దగ్గర లేకపోవడం, ఫోన్ అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందిపడేవారు. ఈ సమస్యకు చెక్ చెప్పేందుకు ప్రభుత్వం 'ఫోన్ మిత్ర' కార్యక్రమాన్ని చేపట్టింది. విద్యార్థులు తమ తల్లిదండ్రులతో మాట్లాడడానికి వీలుగా స్మార్ట్ కార్డ్ సౌకర్యాన్ని తీసుకువచ్చింది. ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఎనిమిది ఫోన్లు అమర్చామని ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ ఫోన్ల ద్వారా తమ తల్లిదండ్రులతో మాట్లాడుకునేందుకు ప్రతి నలుగురు విద్యార్థులకు కలిపి ఒక స్మార్ట్ కార్డు ఇస్తామన్నారు. ఆ కార్డులో నలుగురు విద్యార్థుల తల్లిదండ్రుల లేదా సంరక్షకుల ఫోన్ నంబర్లు ఫీడ్ చేసి ఉంటాయని, ఆ నంబర్లకు మాత్రమే ఫోన్ చేసి 25 నిమిషాలపాటు మాట్లాడడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

విద్యార్థులు తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఫిర్యాదు చేయడానికి వీలుగా ఈ స్మార్ట్ కార్డులో సాంఘిక సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నంబర్ కూడా ఫీడ్ చేసి ఉంటుందని తెలిపారు. స్మార్ట్ కార్డ్ సౌకర్యం కల్పించడం వల్ల విద్యార్థులకు ఇంటిమీద బెంగ కాస్త తగ్గే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. తల్లితండ్రులు సైతం తమ పిల్లల యోగక్షేమాలను తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సౌకర్యం కల్పించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన స్మార్‌కార్డు ఫోన్లు

తింటే అనారోగ్యమే!

- హోటళ్లలో కుళ్లిన మాంసం, ముక్కిపోయిన నిత్యావసరాల వాడకం
- కిచెన్‌లలో దుర్గంధం..
- టాస్క్‌ఫోర్స్ తనిఖీలతో వెలుగులోకి..



కాలం చెల్లిన పదార్థాలను చూపుతున్న అధికారులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఫ్యామిలీతో లేదంటే ఫ్రెండ్స్‌తో అప్పుడప్పుడు హోటల్‌కు వెళ్లి భోజనం చేయడం చాలా మందికి అలవాటు. హోటళ్లకు వెళ్లి ఇష్టమైన ఫుడ్ ఆర్డర్ చేస్తుంటారు. కమ్మటి భోజనం తింటున్నామని అనుకుంటున్నారే తప్ప ఫుడ్ తయారీ విషయంలో హోటళ్లలో ఏం జరుగుతుందో ఎవరూ పట్టించుకోవడం లేదు. తిన్నపుడు బాగుందనే భావనతో ఇంటికి చేరుకుంటారు. కాసేపటి తరువాత కడుపులో ఏదో అలజడి మొదలవుతుంది. గొంతులో మంట, కడుపులో పేగులు మెలేసినంతగా నొప్పి వస్తుంది. గ్యాస్ ప్రాబ్లమ్ అనుకుంటారే గానీ.. తిన్న ఫుడ్ గురించి పట్టించుకోరు. అయితే ఈనెల 10న కామారెడ్డిలోని పలు హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృందాలు దాడులు నిర్వహించాయి. తనిఖీల్లో జీర్ణించుకోలేని వాస్తవాలు వెలుగు చూశాయి. పేరున్న హోటళ్లలోనూ కిచెన్‌లు అధ్వానంగా, కంపుకొడుతూ కనిపించాయి. ఈగల మోతతోపాటు కుళ్లిపోయిన మాంసం, రొయ్యలు, ఇతర ఆహార పదార్థాలను చూసి అధికారులు ముక్కున వేలేసుకున్నారు. నిత్యావసరాలు చాలా వరకు కాలం చెల్లినవి గుర్తించారు.

వాడిన నూనెలనే వాడుతూ...

హోటళ్లలో బ్రాండెడ్‌వి కాకుండా సాధారణ నూనెలు వాడుతున్నారు. దానికి తోడు ఫ్రై ఐటంలు నూనెలలో వేయించిన తరువాత నూనెను ఇతర ఆహార పదార్థాల తయారీకి వినియోగిస్తున్నారు. హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో చాలా మంది పామాయిల్ వాడుతున్నారు. మరికొన్ని హోటళ్లలో లోకల్‌గా తయారయ్యే రిఫైన్డ్ అయిల్‌ను వినియోగిస్తున్నారు. కొనిచోట్ల మాత్రమే బ్రాండెడ్ ఆయిల్స్ వాడుతున్నారని తెలుస్తోంది.

నిల్వ ఉంచిన మాంసం..

హోటళ్లలో ఎక్కువ మంది మాంసాహారం తినడానికే ఇష్టపడతారు. ప్రధానంగా చికెన్, ప్రాన్స్, ఫిష్ ఐటంలకు ఎక్కువ గిరాకీ ఉంటుంది. హోటళ్ల నిర్వాహకులు చేపలు, రొయ్యలను ఇతర ప్రాంతాల నుంచి హోల్‌సెల్‌గా తెప్పించి ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచుతారు. రోజుల తరబడి నిల్వ ఉంచడం మూలంగా అవి పాడవుతాయి. వాటినే శుభ్రం చేసి ఉడికించి వండి వడ్డిస్తున్నారు. అలాగే చికెన్, మటన్ కూడా నిల్వ చేసి, వేడి చేసి వడ్డిస్తున్నారు.

అధ్వానంగా కిచెన్‌లు..

చాలా హోటళ్లలో కిచెన్ గదులు అధ్వానంగా ఉంటున్నాయి. కనీస పరిశుభ్రత పాటించడం లేదు. ఈగలు మోతమోగిస్తున్నా పట్టించుకోరు. కొన్ని హోటళ్లలో ఎలుకలు కూడా సంచరిస్తుంటాయి. తినడానికి కూర్చునే గదులు, హాళ్లు మాత్రమే శుభ్రంగా ఉంటున్నాయి.

రెగ్యులర్ తనిఖీలు లేకే...

సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు హోటళ్లు, స్వీట్ హోంలు, టిఫిన్ సెంటర్లను తనిఖీ చేయాల్సి ఉండగా.. నెలల తరబడి కూడా తనిఖీలు చేపట్టడం లేదు. అప్పుడప్పుడు మొక్కుబడిగా.. అదీ చిన్నచిన్న టిఫిన్ సెంటర్ల మీద దాడులు చేయడం తప్ప పెద్ద హోటళ్లలో ఏం జరుగుతుందో పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించేదాకా ఇక్కడి హోటళ్లలో అధ్వాన పరిస్థితులు ఉన్నట్టు ఎవరూ గుర్తించలేదు. ఇప్పటికైనా అధికారులు రెగ్యులర్‌గా తనిఖీలు చేపట్టి, ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- అమ్మ మాట –అంగన్‌వాడీ బాటలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



చిన్నారులకు ఎగ్ బిర్యానీ తినిపిస్తున్న కలెక్టర్

మాచారెడ్డి : గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీలో అమ్మ మాట –అంగన్‌వాడీ బాటలో మాట్లాడారు. అంగన్‌వాడీలలో మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. కేంద్రం ఆవరణలో న్యూట్రి గార్డెన్, కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం మాచారెడ్డి హైస్కూల్‌లో విద్యార్థుల యూనిఫాంలను హెచ్ఎం వెంకటాచారికి అందించారు. తహసీల్ కార్యాలయాన్ని సందర్శించి, భూ భారతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతంపల్లి నుంచి వచ్చిన ఓ భూ సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ సరళను ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రమేశ్, ఐసీడీఎస్ పీడీ ప్రమీల, ఎంపీడీవో గోపిబాబు, సీడీపీవో రుచిష్మ, సూపర్‌వైజర్ అనసూయ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను కలెక్టర్ బుధవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో దాదాపు రూ. 42.98 కోట్ల విలువ చేసే అల్ప్రాజోలం నిల్వలను సీజ్ చేశామన్నారు. అల్ప్రాజోలం విక్రయించే వారిని విచారించడం ద్వారా ద్వారా పక్కనే ఉన్న మహారాష్ట్రలోని పలు జిల్లాలలో మూలాలు ఉన్నట్లు కనుక్కొని అక్కడి అనేక కంపెనీలపై దాడులు చేశామని తెలిపారు. మత్తు పదార్థాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. నిరంతరం దాడులు కొనసాగించాలన్నారు. గంజాయి, క్లోరల్ హైడ్రేట్, డైజోఫామ్, అల్ప్రాజోలం రవాణా, విక్రయాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1908 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో డీపీఆర్వో రవికుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రక్తదానం చేసి.. ప్రాణదాతలు కండి


బాన్సువాడలో సర్టిఫికెట్లు అందజేస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ : ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. బుధవారం బాన్సువాడలోని తన కార్యాలయంలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వ్యక్తి మూడు నెలలకొకసారి రక్తదానం చేయాలని, రక్తదానంతో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. స్వచ్ఛంద సేవ సంస్థలు సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్, జిల్లా అధ్యక్షులు బంగారు రవి, సంతోష్, విఠల్, సురేష్, మహేందర్, సాయిలు, అనిల్ తదితరులున్నారు.

మారిన విద్యుత్ అధికారులు, సిబ్బంది మొబైల్ నంబర్లు

కామారెడ్డి అర్బన్: పరిపాలన కారణాలతో విద్యుత్‌శాఖ సిబ్బందికి ఎయిర్‌టెల్ సిమ్‌లు అందజేసినట్లు ఎస్ఈ ఎస్.శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి సర్కిల్ పరిధిలో ఆయా గ్రామాల 185 మంది క్షేత్రస్థాయి సిబ్బందికి ఇప్పటి వరకు బీఎస్ఎన్ఎల్ సిమ్‌లు ఉండగా ఎయిర్‌టెల్ సిమ్‌లు కేటాయించామని, కొత్త నంబర్లను ఆయా సబ్‌స్టేషన్లు, కార్యాలయాల్లో ప్రదర్శిస్తారన్నారు. ఆయా గ్రామాల వినియోగదారులు గ్రూప్‌ల ద్వారా కొత్త నంబర్లను తెలుసుకోవాలని ఎస్ఈ సూచించారు.

ఎస్ఈ కొత్త నంబర్	87124 81934
డీఈ టెక్నికల్	87124 81935
డీఈ ఆపరేషన్స్	87124 82264
ఏడీఈ (కామారెడ్డి పట్టణం)	87124 82212
ఏడీఈ (రూరల్)	87124 82190
ఏడీఈ (దోమకొండ)	87124 82141

గండిమాసానిపేటలో వృద్ధుడి ఆత్మహత్య

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసానిపేట గ్రామంలో ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన తిరుచ్చి బాలయ్య (65) అనే వృద్ధుడు తనకు సంబంధించిన వారు ఎవరు లేకపోవడంతో అన్న కొడుకు వద్ద ఉంటున్నాడు. వృద్ధాప్యం పైబడడంతో మనస్తాపం చెందిన బాలయ్య ఈనెల 10న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బుధవారం గ్రామ శివారులో బాలయ్య ఉరి వేసుకుని కనిపించడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువకుల స్వయం ఉపాధి


దోమకొండలో పశువుల కోసం ఏర్పాటు చేసిన డెయిరీ ఫాం


సాగు చేస్తున్న కూరగాయలు

- కాకినాడ, హర్యానా నుంచి బర్రెల కొనుగోలు
- పాడి పశువులు, గొర్రెల ఫాం షెడ్‌ల ఏర్పాటు
- కూరగాయల సాగుకు ప్రాధాన్యం


ప్రత్యేకంగా పెంచుతున్న పశుగ్రాసం

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన నలుగురు యువకులు పాడి పశువుల డెయిరీఫాంతో పాటు గొర్రెలు షెడ్ ఏర్పాటు చేసి స్వయం ఉపాధి పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామ శివారులోని కుడి చెరువు కింద తన మిత్రుడికి చెందిన దాదాపు 9 ఎకరాలు వ్యవసాయ భూమిని వారు లీజుకు తీసుకున్నారు. దీంట్లో ముందుగా డెయిరీఫాంను ప్రారంభించారు. పెద్ద ఎత్తున షెడ్ నిర్మాణం చేపట్టారు. ఏపీలోని కాకినాడ నుంచి 10 బర్రెలను కొనుగోలు చేశారు. అనంతరం హర్యానా రాష్ట్రం నుంచి మరో 10 బర్రెలను కొనుగోలు చేశారు. ప్రస్తుతం అవి ప్రతిరోజు 130 నుంచి 150 లీటర్ల పాలను ఇస్తున్నట్లు వారు తెలిపారు. దీనికి తోడు ఇటీవల గొర్రెల షెడ్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నారు. వీటితో పాటు కూరగాయల సాగును కూడా చేస్తున్నారు. డెయిరీ ఫాం ద్వారా వస్తున్న పాలను మండల కేంద్రంలో రెండు పాయింట్లను ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. డెయిరీఫాం ద్వారా ప్రస్తుతం రోజుకు దాదాపు రూ. 8 వేల నుంచి రూ. 9 వేల వరకు ఆదాయం వస్తుందని వారు తెలిపారు. దీనికి తోడు కూరగాయల ద్వారా ప్రతి వారం మరికొంత ఆదాయం సమకూరుతుంది. పశువులకు దాణాను కూడా అక్కడే పెంచుతున్నారు. చదువుకుని ఎక్కడో ఇతర ప్రాంతాలు, వాణిజ్య దుకాణాల్లో జీతం ఉండే కంటే స్వయం ఉపాధి ద్వారా కష్టపడి ముందుకు సాగుతున్న వీరు మండల కేంద్రానికి ఆదర్శంగా నిలిస్తున్నారు. వీరిని మండలానికి చెందిన పలువురు అభినందిస్తున్నారు.

నలుగురు మిత్రులం కలిసి ఏర్పాటు చేశాం



మండల కేంద్రానికి చెందిన మిత్రులం కలిసి డెయిరీ ఫాం ఏర్పాటు చేయాలని అనుకున్నాం. దానికి గాను నా సొంత స్థలంను మిత్రులందరం కలిసి లీజుకు అగ్రిమెంట్ రాసుకున్నాం. ప్రస్తుతం డెయిరీ షెడ్ పూర్తి కాగా 20 బర్రెలను తీసుకువచ్చాం. దీంతో పాటు గొర్ల షెడ్ కూడా వేశాం. వీటికి తోడు కూరగాయల పంటలు సాగుచేస్తున్నాం. అందరం కలిసి ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు చూసుకుంటాము.

– భూపాల సురేశ్, దోమకొండ

పశువులకు గడ్డిని పెంచుతున్నాం



దోమకొండలోని కుడి చెరువు కింద డెయిరీ ఫాం ఏర్పాటు చేశాం. గ్రామ శివారులో ఉండటంతో ప్రతిరోజు నలుగురం కలిసి పనులు చేస్తాం. 20 బర్ల ద్వారా దాదాపు రోజుకు 130 నుంచి 150 లీటర్ల పాలు వస్తున్నాయి. వీటిని విక్రయించడానికి రెండు సెంటర్లు ఏర్పాటు చేశాం. పశువులకు ప్రత్యేకంగా దాణాను కూడా మేమే పెంచుతున్నాం. కూరగాయాల సాగుతో కూడా మరి కొంత ఆదాయం వస్తుంది.

– మద్దురి భూపాల్‌రెడ్డి, దోమకొండ

మోదీ చేతుల్లో దేశం సురక్షితం

- మన దేశం అగ్రగామిగా ఎదుగుతోంది
- ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి


మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, పక్కన కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్

కామారెడ్డి టౌన్: దేశ ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశం సురక్షితంగా ఉందని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి పేర్కొన్నారు. అన్ని రంగాలలో అగ్రగామిగా నిలుస్తోందన్నారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి 11 ఏళ్లవుతున్న సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దేశ ప్రజలే తన కుటుంబ సభ్యులని ప్రధాని భావిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆ పథకాలను ప్రతి గడపకు తీసుకువెళ్లాలని కార్యకర్తలను కోరారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. అనంతరం కార్యాలయం ఆవరణలో మొక్కలను నాటారు. సమావేశంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, రాష్ట్ర నాయకులు బాణాల లక్ష్మారెడ్డి, కృష్ణారెడ్డి, సంగప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, నాయకులు నంది వేణు,నరేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లను పరిశీలించిన ప్రత్యేకాధికారి



బీబీపేట: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్, కస్తూర్బా గాంధీ హాస్టల్, బీసీ హాస్టల్‌ను బుధవారం మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ పరిశీలించారు. గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభమవుతున్న తరుణంలో హాస్టళ్లలో వసతుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, ఎంపీవో అబ్బాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

60 వసంతాల ఆర్మూర్ మార్కెట్ యార్డు

మీకు తెలుసా?



ఆర్మూర్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయం

ఆర్మూర్: ఆర్మూర్ ప్రాంతంలోని రైతాంగం పండించిన పంటను అమ్ముకోవడానికి అనువుగా ఆర్మూర్ పట్టణంలో 1965 జూలై 6న వ్యవసాయ మార్కెట్ యార్డును నెలకొల్పారు.

- రైతులు తమ పంటల విక్రయాలు నిర్వహించుకోవడానికి 11.07 ఎకరాల సువిశాలమైన స్థలంలో యార్డును ఏర్పాటు చేశారు.
- ఆర్మూర్ మార్కెట్ యార్డు స్థాపించిన సమయంలో ఆర్మూర్, బాల్కొండ, వేల్పూర్, భీమ్‌గల్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, సిరికొండ, జక్రాన్‌పల్లి మండలాలు ఈ యార్డు పరిధిలో ఉండేవి.
- ప్రస్తుతం ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలోని ఆర్మూర్ మండలం, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలోని జక్రాన్‌పల్లి మండలం మాత్రమే ఉన్నాయి.
- ఏఎంసీ పరిధిలో వెయ్యి మెట్రిక్ టన్నుల గోదాం, 600 మెట్రిక్ టన్నుల గోదాం, 200 మెట్రిక్ టన్నుల గోదాములు ఉన్నాయి. వెయ్యి మెట్రిక్ టన్నుల గోదామును సివిల్ సప్లై వారికి అద్దెకు కేటాయించారు. మిగిలిన రెండు గోదాములు ఐడీసీఎంఎస్ వారు అద్దెకు తీసుకున్నారు.

ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ తీసుకోవాలి


జనగామలో అడ్మిషన్ కోసం విద్యార్థి తల్లిదండ్రులకు వివరిస్తున్న అధ్యాపకులు


లింగంపల్లి(ఖుర్దు) గ్రామంలో ..

బీబీపేట/లింగంపేట : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు దరఖాస్తు చేసుకొని అడ్మిషన్ పొందాలని లింగంపేట, బీబీపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు అన్నారు. బీబీపేటతో పాటు జనగామ గ్రామాల్లో, లింగంపేట మండలం లింగంపల్లి(ఖుర్దు), ముస్తాపూర్, ఎల్లారం, ఒంటర్‌పల్లి తదితర గ్రామాల్లో బుధవారం పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి వారికి కళాశాల కోసం వివరించారు. బీబీపేట కళాశాలలో పది మంది సిబ్బంది నియామకం జరిగిందని తెలిపారు. అలాగే నూతన కళాశాలలో వంద శాతం ఉత్తీర్ణత కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రయివేటుకు ధీటుగా బోధన అందిస్తామని విద్యార్థులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా ప్రారంభించాలి


దోమకొండలో లబ్ధిదారుకి మంజూరు పత్రం అందిస్తున్న నాయకులు

దోమకొండ/నాగిరెడ్డిపేట : ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు త్వరగా ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు నిర్మాణ మంజూరు పత్రాలు అందజేసి మాట్లాడారు. దోమకొండ మండల కేంద్రానికి 160 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, వాటిలో 70 ఇళ్లు ప్రారంభించామని, మిగతా లబ్ధిదారులు సైతం త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి సూచించారు. మండలంలోని బొల్లారంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలు కొసాగుతున్న తీరుపై జీపీ కార్యదర్శి సంతోష్‌ను అడిగి తెలుసుకున్నారు. జీపీ కార్యదర్శి యాదగిరి, నాయకులు ఉన్నారు.

బోధనా సామర్థ్యాలు మెరుగుపర్చుకోవాలి


మాట్లాడుతున్న ఆర్‌సీవో సత్యనాథ్‌రెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): గురుకులాల అధ్యాపకులు బోధనా సామర్థ్యాలు, మెలకువలను పెంపొందించుకుని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించాలని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులాల ఉమ్మడి జిల్లా ఆర్‌సీవో సత్యనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కంజర్ బీసీ గురుకులంలో జూనియర్ లెక్చరర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా సత్యనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. అధ్యాపకుల బోధనా సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు ఓరియంటేషన్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని 100 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధమే కారణం

- చిన్నకొడప్‌గల్ జీపీ కార్యదర్శి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- నలుగురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేశ్ చంద్ర


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర


హత్యకు ఉపయోగించిన ఆయుధాలు

కామారెడ్డి క్రైం: ఇటీవల హత్యకు గురైన చిన్నకొడప్‌గల్ జీపీ కార్యదర్శి దరావత్ కృష్ణ కేసును పోలీసులు ఛేదించారు. హత్యకు వివాహేతర సంబంధమే కారణమని తేల్చారు. ఈమేరకు బుధవారం జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రాజేశ్‌చంద్ర వివరాలు వెల్లడించారు. పిట్లం మండలం రూమ్ తండాకు చెందిన దరావత్ కృష్ణ (28) చిన్న కొడప్‌గల్ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తుండేవాడు. చిన్నకొడప్‌గల్‌కు చెందిన లింగంపేట మల్కయ్య అలియాస్ మల్కన్న ఉపాధి నిమిత్తం హైదరాబాద్ వెళ్లి ఇటీవల ఇంటికి వచ్చాడు. తన భార్య సుజాతకు పంచాయతీ కార్యదర్శి కృష్ణతో వివాహేతర సంబంధం ఏర్పడిందని గుర్తించాడు. ఈ విషయంలో భార్యతో తరచుగా గొడవపడేవాడు.చివరికి తమ సంసారం చక్కబెట్టుకోవాలని భార్యాభర్తలు నిర్ణయించుకొని, కృష్ణను చంపాలనుకున్నారు. ఇందుకోసం తమ కులస్తులైన ఏరనోళ్ల బాల్‌రాజ్, మల్కయ్యల సహాయం తీసుకున్నారు. ఈనెల 5న సుజాత ద్వారా కృష్ణను ఇంటికి పిలిపించుకుని నలుగురూ కలిసి కత్తి, గొడ్డలి ఇనుపరాడ్లతో కొట్టి చంపారు. ఆపై మృతదేహాన్ని, కృష్ణ బైక్‌ను సమీపంలోని రెడ్డి చెరువులో పడవేశారు. 7న గాయాలతో కూడిన కృష్ణ మృతదేహాన్ని రెడ్డి చెరువులో పోలీసులు గుర్తించారు. విచారణ చేపట్టి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు ఎస్పీ తెలిపారు. వారిని రిమాండ్‌కు తరలిస్తున్నామని వెల్లడించారు. హత్య కేసును ఛేదించిన బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి, రూరల్ సీఐ రాజేష్, పిట్లం ఎస్సై రాజును ఆయన అభినందించారు.

బైక్‌ల చోరీ కేసులో నిందితుల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏసీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ నాగేంద్రచారి వివరాలు వెల్లడించారు. నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని పట్టుకున్నారు. వారిని విచారించగా బైక్‌లను దొంగతనాలు చేసినట్లు తెలిపారు. నిందితులు బోధన్ పట్టణానికి చెందిన మాలోత్ రమేష్, కటం రవిగా గుర్తించారు. నిందితులు బాసర్ రైల్వే స్టేషన్‌లో ఒక బైక్, తిర్మన్‌పల్లి గ్రామంలో ఒక బైక్, వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో ఒకటి, నిజామాబాద్ పట్టణంలో మూడు బైకులను చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గతంలో బైక్ చోరీ కేసులో జైలుకు వెళ్లివచ్చినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి జైలుకు తరలించినట్లు తెలిపారు.ఎస్‌హెచ్‌వో రఘుపతి,తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ గ్యాంగ్ సభ్యుడు..

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ హోటల్ వద్ద ఆటో డ్రైవర్‌ను బెదిరింపులకు పాల్పడిన కేసులో రౌడీషీటర్ బర్కాత్ ఆమీర్ అనుచరుడు ఇర్ఫాన్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. ఇర్ఫాన్ నుంచి ఒక తల్వార్, రెండు కత్తులు, రెండు పంచ్‌లు, 50 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బర్కాత్ అమీర్‌తోపాటు మరో 10 మంది పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఇర్ఫాన్‌ను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

పేకాడుతున్న 10మంది..

ఖలీల్‌వాడి: నగరంలోని గౌతమ్‌నగర్‌లో విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాడుతున్న 10 మందిని అరెస్ట్ చేశారు. 8సెల్‌ఫోన్లు, రూ. 5660 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 11 మంది బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ రూ.3, 25,500 మంజూరైనట్లు తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధానకార్యదర్శి కిష్టయ్యతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

'మద్యం అక్రమ రవాణా కాకుండా చూడాలి'


సలాబత్‌పూర్ సరిహద్దులో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ ఈఎస్

మద్నూర్: పక్క రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం, మత్తు పదార్థాలు రవాణా కాకుండా సరిహద్దు చెక్‌పోస్ట్‌లో గట్టి నిఘా ఉంచాలని ఇన్‌చార్జి ఎక్సైజ్ ఈఎస్ హన్మంత్‌రావు ఆదేశించారు. బుధవారం సలాబత్‌పూర్ వద్ద గల అంతర్రాష్ట్ర ఎక్సైజ్ చెక్‌పోస్ట్‌ను ఆయన తనిఖీ చేశారు. మహారాష్ట్ర నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. సలాబత్‌పూర్ ఎక్సైజ్ సీఐ జావీద్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

కూలీ గిట్టుబాటయ్యే ప్రదేశాలను గుర్తించాలి



ఎల్లారెడ్డి: ఉపాధిహామీ పనులకు హాజరయ్యే కూలీలకు కూలీ గిట్టుబాటయ్యే పని ప్రదేశాలను గుర్తించాలని క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ విప్లవ్‌కుమార్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో ప్రకాష్, ఏపీవో వినోద్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులున్నారు.

క్రైం కార్నర్

కరెంట్ షాక్‌తో బాలుడి మృతి


గోవర్ధన్ (ఫైల్)

బాన్సువాడ రూరల్: మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో ఓ బాలుడు కరెంట్ షాక్‌తో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఇబ్రాహీంపేట్ గ్రామం గంగపుత్ర కాలనీకి చెందిన దుబాయ్ సాయిలుకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు గోవర్ధన్(13), భార్య గంగవ్వ ఉన్నారు. ఇద్దరు కూతుళ్లకు పెళ్లిళ్లు జరుగగా, సాయిలు ఉపాధి నిమిత్తం మలేషియా వెళ్లాడు. ఇంటివద్ద భార్య గంగవ్వ, కుమారుడు గోవర్ధన్ ఉంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, ఈదురుగాలులకు వారి పెంకుటిళ్లు ముందర వేసిన రేకుల షెడ్డు ఇనుప పైప్‌కు విద్యుత్ వైర్లు తగిలి కరెంట్ సరఫరా అయ్యింది. దీన్ని గమనించని గోవర్ధన్ బుధవారం బయట ఆడుకుంటున్న సమయంలో ఇనుపపైప్‌కు తాకడంతో కరెంట్‌షాక్‌తో విగతజీవిగా మారాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని బాన్సువాడ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మలేషియాలో ఉన్న తండ్రి సాయిలుకు ఫోన్‌లో సమాచారం అందించగా,కుమారుడి కడచూపుకు వస్తానని చెప్పడంతో అంత్యక్రియలు నిర్వహించలేదు. విద్యార్థి మృతిపట్ల ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మోపాల్ మండలంలో..

మోపాల్: మండలంలోని న్యాల్‌కల్‌లో ఓ బాలుడు కరెంట్‌షాక్‌తో మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన రాజు-మమత దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడైన శ్రీ వర్షిత్ (9) నగరంలోని ఓ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. బుధవారం వారి ఇంటి వద్ద ఆడుకుంటున్న శ్రీ వర్షిత్‌కు తెగిపడ్డ బోరు మోటారు సర్వీస్ వైరు తగిలి విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు.

లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..

వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ గ్రామ సమీపంలో 63వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. మోర్తాడ్ వైపు బైక్‌పై వెళ్తున్న సదరు వ్యక్తిని ఆర్మూర్ వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేవన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కువైట్‌లో గుండెపోటుతో మిట్టాపల్లి వాసి ..


గంగాధర్ (ఫైల్)

డిచ్‌పల్లి: మండలంలోని మిట్టాపల్లి గ్రామానికి చెందిన సిర్నాపల్లి గంగాధర్ (45) బతుకుదెరువు కోసం కువైట్ దేశానికి వెళ్లగా, రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గంగాధర్ ఐదేళ్ల క్రితం కువైట్ దేశానికి వెళ్లగా, గతంలో ఒకసారి గుండెపోటు రావడంతో చికిత్స పొందాడు. సెలవుపై స్వగ్రామానికి వచ్చి రెండు నెలల క్రితం తిరిగి వెళ్లాడు. రెండు రోజుల క్రితం డ్యూటీలో ఉండగా మరోసారి గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతివార్త కుటుంబసభ్యులకు తెలియడంతో వారు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతుడికి తల్లిదండ్రులు, భార్య, ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి రప్పించేలా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ప్రభుత్వం కృషి చేయాలని, మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో తాళం వేసిన ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన మన్నె అంజవ్వ, కుటుంబ సభ్యులు నాలుగు రోజుల కిందట ఇంటికి తాళం వేసి, హైదరాబాద్ వెళ్లారు. కాగా మంగళవారం రాత్రి వారు ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతోపాటు బీరువా తెరచి ఉండటం గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌చార్జీ ఎస్సై రాజు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో దాచిన 40 తులాల వెండి అభరణాలు, రూ. 25వేల నగదును ఎత్తుకువెళ్లినట్లు తెలిపారు. ఈమేరకు బాధిత కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మోటార్ కేబుల్ వైరు..

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు అంతంపల్లి గ్రామ శివారుల్లో ఉన్న వ్యవసాయ బోరు బావుల వద్ద మోటర్ కేబుల్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం వేకువజామున కత్తిరించి అపహరించుకెళ్లారు. సుమారు 11మంది రైతులకు సంబంధించిన కేబుల్ వైర్లు చోరీ కాగా, ఈ విషయమై వారు భిక్కనూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్, ఆయిల్..

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోని లక్ష్మి లిఫ్టు కోసం ముప్కాల్ మండలం నల్లూర్ శివారులో నిర్మించిన సబ్‌స్టేషన్ నుంచి ట్రాన్స్‌పార్మర్ కాపర్ కాయిల్స్, ఆయిల్ చోరీకి గురైంది. లిఫ్టు ఆపరేటర్ భానుచందర్ బుధవారం ఉదయం సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై బుధవారం ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి, ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ విచారణ చేపట్టారు. మే31 నుంచి జూన్ 10 మధ్య కాలంలో చోరీ జరిగినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దుండగులు రెండు ట్రాన్స్‌ఫార్మర్లను కింద పడేసి కాపర్ కాయిల్స్, ఆయిల్ ఎత్తుకెళ్లారు. లక్ష్మి లిఫ్టు డిప్యూటీ ఈఈ సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.